క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

మైదానంలో నిలిచిన నీటితో క్రీడలకు ఆటంకం



చిట్టివలస బంతాట మైదానంలో నిలిచిన వర్షం నీరు

తగరపువలస: చిట్టివలస బంతాట మైదానంలో వర్షం నీరు నిలిచిపోవడంతో క్రీడాకారులకు ఇబ్బందిగా ఉంటోంది. ఈ ప్రాంత క్రీడాకారులు నిత్యం ఇక్కడి ఆట స్థలంలో క్రికెట్, ఫుట్‌బాల్ తదితర ఆటలతోపాటు వాకింగ్, రన్నింగ్ చేస్తుంటారు. ఈ ఆటస్థల నిర్వహణను ఎవరూ పట్టించుకోకపోవడంతో తరచూ వర్షాలకు కోతకు గురవుతోంది. దీంతో ఇక్కడి క్రీడాకారులే ఆటస్థలం కోతకు గురి కాకుండా డెబ్రిస్ వేయడంతో వర్షం నీరు నిలిచిపోతోంది. చిట్టివలస జ్యూట్‌మిల్లు పనిచేసేటప్పుడు కార్మిక సంఘాలు తరచూ ఈ మైదానంలో బహిరంగ సభలు నిర్వహించేవి. దీంతో మిల్లు యాజమాన్యం ఆటస్థలం నిర్వహణ చూసేది. ప్రస్తుతం ఎవరైనా దాతలు ఈ ఆటస్థలాన్ని దత్తత తీసుకుని నిర్వహణకు సహకరించాలని క్రీడాకారులు కోరుతున్నారు.

మతం పేరుతో విభజనకు బీజేపీ యత్నం



కళానగర్‌లో ప్రచారం చేస్తున్న పైడిరాజు

మధురవాడ: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం దేశాన్ని కులాలు, మతాల పేరుతో విభజించి పాలన సాగిస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ చేపడుతున్న బస్సు యాత్రలో భాగంగా జీవీఎంసీ 7వ వార్డు కళానగర్‌లో ఆదివారం ఆయన ఇంటింటికీ కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు అమ్మేయాలని చూస్తున్నారన్నారు. జాతీయ రహదారిపై చంద్రంపాలెం హైస్కూల్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించకుండా రోడ్డుకు అడ్డంగా గ్రిల్స్ వేయడం సరికాదన్నారు. వి.సత్యనారాయణ, ఎండీ బేగం తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురిపై కేసు

పద్మనాభం: మండలంలోని బాందేవపురంలో భూమి విషయమై జరిగిన ఘర్షణలో దండు నరసింహరాజు ఇంటిలోకి అక్రమంగా చొరబడి కత్తులు, గుణపాలు, కర్రలతో దాడి చేసి భయభ్రాంతులకు గురి చేసిన అదే గ్రామానికి చెందిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్టు సీఐ ఎస్.సన్యాసినాయుడు తెలిపారు. సీఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. ఇందుకూరు శ్రీనివాసరాజు, వెంకట సత్యనారాయణరాజు, దండు కృష్ణంరాజు, అద్దాల రవి వర్మ, రాజు వర్మ ఈ నెల 16న అదే గ్రామానికి చెందిన దండు నరసింహరాజు ఇంటిలోకి అక్రమంగా చొరబడి కత్తులు, గుణపాలు, కర్రలతో దాడి చేసి భయభ్రాంతులకు గురి చేశారు. దీనిపై నరసింహరాజు ఫిర్యాదు మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

గెలుపుతో వైఎస్సార్ సీపీలో జోష్



లక్ష్మీపురం సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన జగదీశ్వరరావును అభినందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎన్నికల పరిశీలకుడు బాలరాజు, తదితరులు

- ఒక పంచాయతీ సర్పంచ్, 7 వార్డు స్థానాలు ఏకగ్రీవం
- నియోజకవర్గంలోని పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం



పూసర్ల రామారావు



ఎరుకొండ కృష్ణకుమారి



వాసి ఆదిలక్ష్మి



సాడి బంగారమ్మ



నిమ్మల లక్ష్మి



బోని పద్మావతి



పిల్లా కృష్ణ



గంగిరెడ్ల లక్ష్మి

తగరపువలస: ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికలకు సంబంధించి భీమిలి నియోజకవర్గంలో ఒక సర్పంచ్, ఎనిమిది వార్డు సభ్యుల ఎన్నిక ఏకగ్రీవమైంది. వీటిలో ఒక వార్డు సభ్యుడు ఇండిపెండెంట్‌గా మిగిలిన వారంతా వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థులే కావడం గమనార్హం. దీంతో భీమిలి నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం పుంజుకొంది. ఈ ఎన్నికలకు సంబంధించి భీమిలి మండలం లక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్‌గా వైఎస్సార్‌సీపీ బలపరచిన లచ్చుభుక్త జగదీశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల లచ్చుబుగత రామారావు మృతి చెందడంతో ఆ స్థానంలో ఏర్పడిన ఖాళీకి సంబంధించి ఆయన కుమారుడు జగదీశ్వరరావు ఎన్నికయ్యాడు. టి.నగరపాలెం పంచాయతీ 10వ వార్డు సభ్యునిగా పూసర్ల రామారావు (ఇండిపెంటెంట్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు.

- ఆనందపురం మండలంలో నాలుగు వార్డు స్థానాలకు వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థులే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారిలో కణమాం పంచాయితీ 3వ వార్డుకు ఎరుకొండ కృష్ణకుమారి, వెల్లంకి 6వ వార్డుకు వాసి ఆదిలక్ష్మి, 12వ వార్డుకు సాడి బంగారమ్మ, పాలవలస 1వ వార్డుకు నిమ్మల లక్ష్మి ఎన్నికయ్యారు.
- పద్మనాభం మండలంలో వైఎస్సార్‌సీపీ బలపరచిన ముగ్గురు వార్డు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరిలో రెడ్డిపల్లి 9వ వార్డుకు బోని పద్మావతి, చిన్నాపురం 2వ వార్డుకు పిల్లా కృష్ణ, బాందేవపురం 10వ వార్డుకు గంగిరెడ్ల లక్ష్మి ఎన్నికయ్యారు. వీరందరినీ ఆయా గ్రామాల వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు అభినందించారు.

విద్యార్థులకు హిందీ సర్టిఫికెట్ల పంపిణీ



హిందీ సర్టిఫికెట్లతో ఆదర్శ హిందీ ప్రేమీ మండలి విద్యార్థులు

తగరపువలస: దక్షిణ భారతదేశ హిందీ ప్రచారసభ – చెన్నై ఆధ్వర్యంలో ఈ నెల ఫిబ్రవరిలో నిర్వహించిన లోయర్, హయ్యర్ పరీక్షలకు సంబంధించి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఆదివారం భీమిలిలో సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. అలాగే సెప్టెంబరులో జరగనున్న హయ్యర్ పరీక్షలకు సంబంధించి ప్రీ ప్రైమరీ పరీక్షలు నిర్వహించారు. ఈ ప్రీ ప్రైమరీ పరీక్షలు మలి విడత హయ్యర్ విద్యార్థులతోపాటు లోయర్ విద్యార్థులకు కూడా ఈ నెల 27న జరుగుతాయని భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు తెలిపారు.

రహదారులు, డ్రైనేజీలు లేక ఇబ్బందులు



వలందపేటలో రాళ్లు తేలిన రహదారులు



ఇళ్ల ముందు నాచు కట్టిన మురుగునీరు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండో వార్డు వలందపేటలో అంతర్గత రహదారులు, డ్రైనేజీలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఇటీవల ఈ గ్రామంలో కొత్తగా 200 వరకు నివాస గృహాలు పెరిగినా అందుకు సరిపడా వసతులు పెరగడం లేదని వాపోతున్నారు. ముఖ్యంగా వలందపేటలో కొత్తగా ఏర్పాటైన ఇళ్లకు వసతులు లేకపోవడమే కాకుండా వాటి చుట్టూ మురుగునీరు చేరి, తుప్పలు పెరిగి అడవులను తలపిస్తున్నాయి. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఈ గ్రామంలో వసతులు కల్పించాలని వలందపేట వాసులు కోరుతున్నారు. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కూడా ఇక్కడి సమస్యలు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లినట్టు స్థానికులు తెలిపారు. ప్రస్తుతం యుద్ధప్రాతిపదికన వలందపేటలో తుప్పలు, మురుగు తొలగించేలా శానిటేషన్ కార్యదర్శులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

టీడీపీ హయాంలోనే పంచగ్రామాల భూ సమస్యకు ఆజ్యం



ధర్నా చేస్తున్న సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం నాయకులు, కార్పొరేటర్ గంగారావు, తదితరులు

- 1996 – 97లో జారీ చేసిన రైత్వారీ పట్టాలు రద్దు చేయాలి
- సమైక్య ప్రజారైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వేపగుంటలో ధర్నా

సింహాచలం: త్వరగా పంచగ్రామాల భూసమస్యను పరిష్కరించాలని సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు వేపగుంట కూడలి వద్ద సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి టి.వి.కృష్ణంరాజు మాట్లాడుతూ 1996 వరకు లేని భూసమస్య అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలోనే ప్రారంభమైందన్నారు. ఆ రోజు నుంచి కష్టాలు మొదలయ్యాయన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు దాటినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం 22(ఏ) నుంచి తొలగించి సర్వీసు ఇనాం భూములను క్రమబద్ధీకరించేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. అదే విధంగా 22(సీ) నుంచి జిరాయితీ భూములను కూడా తొలగిస్తూ నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఇప్పటికే హైకోర్టు యథాస్థితిని కొనసాగించాలని తాత్కాలిక ఆర్డర్ జారీ చేసిందని, దాని ప్రకారం ఇళ్ల మరమ్మతులకు, స్థలాల క్రయ విక్రయాలకు, నిర్మాణాలకు అనుమతించాలన్నారు. 1996-97లో అప్పటి టీడీపీ ప్రభుత్వం దేవస్థానానికి ఇచ్చిన రైత్వారీ పట్టాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 1903 సర్వే సెటిల్‌మెంట్ రికార్డు(గిల్‌మెన్ రికార్డు) ఆధారంగా భూహక్కుదారుల్ని గుర్తించాలని కోరారు. 78వ వార్డు కార్పొరేటర్ గంగారావు మాట్లాడుతూ సుమారు 26 ఏళ్లుగా భూసమస్యతో పంచగ్రామాల ప్రజలు బాధలు పడుతున్నారన్నారు. భూసమస్యని పరిష్కరిస్తామని హామీలు కురిపిస్తూ అధికారంలోకి వచ్చిన పార్టీలన్నీ ఆ తర్వాత సమస్యని తీర్చకుండా మిన్నకుండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం నాయకులు బి.రమణి, సిహెచ్.ఎస్.గోపాలకృష్ణ, ప్రతాప్, అరుణ్‌కుమార్, కె.ఆర్.కె.ప్రసాద్, కోటేశ్వరరావు, ఎస్.రాజు, రమణ, నారాయణరావు, కృష్ణారావు, శంకరరావు, శ్రీనివాసరావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పార్కింగ్ రుసుము పెంపు



బోర్డుపై పార్కింగ్ రుసుము వివరాలు

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో సందర్శకుల వాహనాల పార్కింగ్ రుసుము ఏపీటీడీసీ ఆదివారం నుంచి పెంచింది. ఇప్పటి వరకు ఉన్న బస్సు ఛార్జీలను రూ.100కు పెంచింది. అదేవిధంగా ఆటో ఛార్జీలు గతంలో లాగా రూ. 20 ఉంచగా, కార్ పార్కింగ్‌కు రూ.50 కాగా, ద్విచక్ర వాహనాలకు రూ.10 నుంచి రూ.20కు పెంచారు. వీటిని పర్యాటకులు గమనించాలని అధికారులు కోరారు.

జీతాల మంజూరుకు చర్యలు తీసుకోవాలి

ఆనందపురం : ఆనందపురం ఎంఈవో ఎస్ ఎస్ పద్మావతిపై విచారణ జరుపుతున్న అధికారులు నిలిచిపోయిన జీతాల మంజూరుకు తక్షణ చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.నాగేశ్వరరావు, టి.ఆర్.అంబేడ్కర్ ఓ ప్రకటనలో ఆదివారం కోరారు. స్పందనలో తాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కలెక్టర్ విచారణకు ఆదేశించడంపై హర్షం వ్యక్తం చేశారు. సాంకేతిక కారణాలు వల్ల ఎంఈవో జీతం నిలిచిపోతే... ఆమె ఉపాధ్యాయుల జీతాల మంజూరు విధుల నుంచి అర్ధాంతరంగా తప్పుకోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. దీనివల్ల జూన్ నెల జీతాలు ఇంత వరకూ అందని పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జీతాల మంజూరు విషయంలో తమకు న్యాయం చేయాలని కోరారు.

మహిళ మెడలో పుస్తెలతాడు అపహరణ

ఆనందపురం : మండలంలోని ముకుందపురం ప్రధాన రహదారిపై శనివారం రాత్రి ఓ మహిళ మెడలోని బంగారు పుస్తెల తాడుని దుండగులు తెంపుకుపోయారు. ఈ మేరకు బాధితులు ఆదివారం ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విజయనగరం పెద్దపల్లి వీధికి చెందిన శఠగోపం శ్రీనివాసులమ్మ, బంధువులు రెండు ద్విచక్ర వాహనాలపై శనివారం గాజువాక వెళ్లారు. అక్కడ పని ముగించుకొని తిరిగి విజయనగరం వెళ్లడానికి వాహనాలపై బయలుదేరారు. వారు ముకుందపురం రహదారి వద్దకు చేరుకునే సరికి వారిని అనుసరిస్తూ బైక్‌పై వస్తున్న ఇద్దరు దుండగులలో ఒకరు... ద్విచక్ర వాహనంపై వెనుక వైపు కూర్చున్న శ్రీనివాసులమ్మ మెడలోని బంగారు పుస్తెల తాడుని తెంపుకొని పరారయ్యారు. దీంతో బాధితురాలు, ఆమె బంధువులు స్థానికుల సాయంతో రాత్రికి అక్కడే ఉండి ఆదివారం ఉదయం ఆనందపురం సీఐ రామచంద్రరావుకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ జరుపుతున్నారు.

పంట వివరాల నమోదు తప్పనిసరి

ఆనందపురం : రైతులు తప్పనిసరిగా పంట వివరాలు నమోదు (ఈ – క్రాప్) చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి సంధ్యారత్న ప్రభ సూచించారు. వ్యవసాయానికి సంబంధించిన ప్రోత్సాహకాలు పొందాలన్నా, లబ్ధి పొందాలన్నా ఈ – క్రాప్ తప్పనిసరిగా చేయించాలన్నారు. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వరి నాట్లు వేసిన రైతులందరూ తమ ఆధార్‌కార్డు, భూ హక్కు పత్రాలతో రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఆర్బీకేలకు ధాన్యం విక్రయించాలన్నా, పంట నష్ట పరిహారం పొందాలన్నా, రైతు బజారు కార్డులు పొందాలన్నా ఈ – క్రాప్ నమోదు తప్పనిసరి అన్నారు. మండలంలోని రైతులందరూ ఈ విషయాన్ని గమనించాలని ఆమె కోరారు.

బీచ్ ఫొటోగ్రాఫర్స్‌కు టీ షర్ట్‌ల పంపిణీ



బీచ్ ఫొటోగ్రాఫర్స్‌తో లయన్స్ క్లబ్ సెంటినల్ ప్రతినిధులు

భీమునిపట్నం: భీమిలి బీచ్ సినిమాటోగ్రాఫర్స్‌కి లయన్స్ క్లబ్ భీమిలి సెంటినల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్. ఎ.గోపాలరావు ఆదివారం సాయంత్రం టీ షర్ట్స్, ట్రౌజర్స్ పంపిణీ చేశారు. పర్యాటకులకు ఇక్కడ నిత్యం సేవలు అందించే ఫొటోగ్రాఫర్స్‌ను అభినందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్, జెడ్పీ బొడ్డేపల్లి రాము, నిర్వాహక సంస్థ ప్రతినిధులు ప్రసాద్, సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

వంతెనలపై ఫుట్‌పాత్‌లు శిథిలం



అవంతి కళాశాల వైపు ఫుట్‌పాత్‌పై పలకలు లేచిపోయి మొలిచిన గడ్డి



వేంకటేశ్వర మెట్ట వైపు పలకలు మాయమై మొలిచిన గడ్డి

- రాకపోకలకు బాటసారుల అవస్థలు

తగరపువలస: స్థానిక గోస్తనీ నది వంతెనపై ఫుట్‌పాత్‌లు శిథిలం కావడంతో తగరపువలస సమీప గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ వాటిపై నడుచుకుంటూ రాకపోకలు సాగిస్తున్నారు. 1974లో నిర్మించిన ఈ వంతెనకు ఇప్పటికి పలుమార్లు మరమ్మతులు చేయించినా ఫుటపాత్‌లు మెరుగుపడలేదు. విజయనగరం వైపు నుంచి తగరపువలస వచ్చే వారికి వంతెన ప్రారంభంలోని ఫుట్‌పాత్‌పై సిమెంట్ పలకలు ఎగుడు దిగుడుగా లేచి అందులో నుంచి మొక్కలు, గడ్డి, పొదలు దర్శనమిస్తున్నాయి. అలాగే తగరపువలస నుంచి విజయనగరం వైపు వెళ్లే క్రమంలో వంతెన ఫుట్‌పాత్‌పై సిమెంట్ పలకలు మాయమై గడ్డి మొలిచింది. నిత్యం చెరకుపల్లి అవంతి కళాశాల విద్యార్థులు, భీమిలి మండలం టి.నగరపాలెం, భోగాపురం మండలం చెరకుపల్లి, మహరాజుపేట గ్రామ పంచాయతీల ప్రజలు ఈ ఫుట్‌పాత్‌లపై నుంచే తగరపువలసకు రాకపోకలు సాగిస్తుంటారు. శిథిలమైన ఫుట్‌పాత్‌ల కారణంగా తరచూ కాళ్లు మెలికలు పడి బాటసారులు ఇబ్బంది పడుతున్నారు. జాతీయ రహదారుల సంస్థ ఈ ఫుట్‌పాత్‌లకు మరమ్మతులు చేపట్టాలని గోస్తనీ నది చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

జీవీఎంసీ జోన్ - 2 అధికారుల ఫోన్ నంబర్లు ఇవే

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 పరిధిలో పలువురు అధికారులు వేర్వేరు ప్రాంతాలకు బదిలీకాగా వారి స్థానంలో మరికొందరు ఇటీవల బాధ్యతలు చేపట్టారు. వారి వివరాలు, ఫోన్ నంబర్లు ఇలా ఉన్నాయి.

అధికారి	హోదా	ఫోన్ నంబర్
కె.కనకమహాలక్ష్మి	జోనల్ కమిషనర్	98483 66878
ఎ.అప్పలరాజు	సూపరింటెండెంట్	99482 96999
కె.వెంకటేశ్వరరావు	ఏసీపీ (టౌన్‌ప్లానింగ్)	99123 49435
వరప్రసాద్	టీపీవో (టౌన్‌ప్లానింగ్)	93902 89961
రూఫస్	టీసీఎస్ (టౌన్‌ప్లానింగ్)	99123 49431
డాక్టర్ కిషోర్	వైద్యాధికారి	95026 61063
మంగరాజు	బీడీఆర్ (పారిశుధ్యం)	93912 52999
శ్రీనివాసరాజు	శానిటరీ సూపర్‌వైజర్	99488 83930
పి.రమేష్	ఆర్‌వో (రెవెన్యూ విభాగం)	99853 73797
బి.రమేష్	ఆర్ఐ (రెవెన్యూ విభాగం)	98665 08143
ముగడ రాజు	ఆర్ఐ (రెవెన్యూ విభాగం)	98664 44408
ఎస్.మత్స్యరాజు	ఈఈ (ఇంజినీరింగ్ వర్క్స్)	99485 25297
ఆర్.వంశీకృష్ణ	డీఈ (ఇంజినీరింగ్ వర్క్స్)	99123 49450
శ్రీధర్	ఏఈ (ఇంజినీరింగ్ వర్క్స్)	99599 28441
అన్నంనాయుడు	ఏఈ (ఇంజినీరింగ్ వర్క్స్)	77299 95930
కె.ఎల్.సుధాకర్	ఈఈ (నీటి సరఫరా)	99515 32875
డి.శ్రీహరి	డీఈ (నీటి సరఫరా)	99485 25293
వై.అప్పాజీ	ఏఈ (నీటి సరఫరా)	99123 49432
టి.రాయల్ బాబు	విద్యుత్ ఈఈ	99480 78504
ఎస్.గంగాధర్	ఏపీడీ (యూసీడీ)	77299 95947

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ప్రచారం చేస్తున్న ప్రబోధానందుని శిష్యులు

తగరపువలస: త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన 100 రకాల భగవద్గీత గ్రంథాలపై ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. చిట్టివలస, తగరపువలస, భీమిలి, సాయిరాం కాలనీ, మధురవాడ పరిధిలో భక్తులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ప్రబోధ సేవా సమితి ప్రతినిధి రావణ అక్షయ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వయసుతో నిమిత్తం లేకుండా భగవద్గీత చదవాలని సూచించారు. అందులోని సారాంశాన్ని ఆచరించాలని సూచించారు. ప్రచార కార్యక్రమంలో బాలకృష్ణ, ఆదమ్మ, మీనా, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ నృత్యం అదరహో..



బృంద నృత్యం చేస్తున్న కళాకారులు

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆద్యంతం అలరించింది. నగరానికి చెందిన లలిత డ్యాన్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న విద్యార్థినులు అద్భుతమైన పద నర్తన, హావభావాలతో ప్రేక్షకుల హృదయాలను దోచుకున్నారు. కళాకారులు అనన్య, పవిత్ర, లీలా, సౌమ్య, భావన, సిరిచందన, దివ్య, హేమ సుధ, దివ్యశ్రీ, నీహారిక, లక్ష్మి, రేఖ, వర్షిణి, నిత్య, సంయుక్త, ఐశ్వర్య, హరిణి, హేమశ్రీ నృత్యం చేయగా ఎం.లలిత, జి.సోని నృత్య దర్శకత్వం వహించారు. కార్యక్రమాన్ని స్థానిక ఏవో టి.విశ్వనాథ రెడ్డి పర్యవేక్షించారు.